

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**


**మేడ్చల్ నేడు బ్యూరో:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ – మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి ఆయన 106 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యల ను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి, తిరస్కరణకు గల కారణాలను గురించి తప్పని సరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా అప్రమత్త చర్యలు

**పోలంపల్లి సర్పంచ్ హేమలత బాలాజీ సేవాభావం**



**కారేపల్లి, నేడు న్యూస్:** కారేపల్లి మండలంలోని పోలంపల్లి గ్రామంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామపంచాయతీ సర్పంచ్, దిశ కమిటీ సభ్యురాలు హేమలత బాలాజీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు, కాలువలు, డ్రైనేజీలను స్వయంగా పరిశీలిస్తూ సమస్యలు ఏర్పడకుండా గ్రామపంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సర్పంచ్ హేమలత బాలాజీ ఆదేశాల మేరకు జీపీ కార్మికులు వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువలను శుభ్రం చేయడం, నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించడం వంటి పనులను నిరంతరం చేపడుతున్నారు. గ్రామంలో ఎక్కడైనా వర్షం వల్ల ఇబ్బందులు తలెత్తిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలు గ్రామ ప్రజల్లో భరోసా కల్పిస్తున్నాయి. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం అందుబాటులో ఉండి సేవలందిస్తున్న సర్పంచ్ హేమలత బాలాజీ సేవలను గ్రామస్థులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ చేపడుతున్న చర్యలు ఆదర్శప్రాయమని పలువురు గ్రామస్థులు కొనియాడారు.



## బోనాల పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు

**భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** రాష్ట్రంలో అత్యంత వైభవంగా జరిగే బోనాల మహోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అధికారులను ఆదేశించారు. బోనాల పండుగ ఏర్పాట్లపై ఎమ్మెల్యే శ్రీగణేష్ మల్కాజిగిరి డీసీపీ (లా అండ్ ఆర్డర్) శ్రీధర్, ట్రాఫిక్ డీసీపీ కె. రాహుల్ రెడ్డితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల పరిసరాల్లో చేపట్టాల్సిన భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. ఆలయాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా విస్తరణ, అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, భక్తుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. బోనాల సందర్భంగా వేలాది మంది భక్తులు ఆలయాలకు తరలివస్తారని, వారి భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. భక్తులు ప్రశాంతంగా, సురక్షితంగా అమ్మవారిని దర్శించుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. పోలీసు అధికారులు కూడా పండుగ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, అత్యవసర సేవలు సమర్థంగా అమలు చేస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.



## శ్రీ నిలయ అపార్ట్‌మెంట్‌లో 'సురక్ష' యాప్‌పై అవగాహన

**ఉప్పల్/ కాప్రా, నేడు న్యూస్:** కాప్రా సర్కిల్ పరిధిలోని కమలానగర్‌లో ఉన్న శ్రీ నిలయ అపార్ట్‌మెంట్‌లో నివాసితులకు 'సురక్ష' యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలు, వృద్ధులు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే తెలియని కూలీలు, పని మనుషులను నియమించుకునే ముందు వారి వివరాలను తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు పని ముసుగులో నేరాలకు పాల్పడుతున్న ఘటనల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. 'సురక్ష' యాప్‌లోని ఎస్ఓఎస్, లొకేషన్ షేరింగ్, అత్యవసర భద్రతా సేవల వినియోగాన్ని వివరించి, ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న, అపార్ట్‌మెంట్ నివాసితులు తుమ్మల హేమలత, తుమ్మల నాగేంద్ర ప్రసాద్, మదన్, భక్త్ సింగ్, కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బూడిద జనార్ధన్ గౌడ్, కమిటీ సభ్యులు వరకాల పెంటయ్య గౌడ్, చిన్న యాదవ్, ఎం.ఎన్. చారి, బాలరాజు, సి.ఎన్. రావు, నవీన్ పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లాలో ప్రజారోగ్య వ్యవస్థ మెరుగుకు పటిష్ట చర్యలు

- ప్రభుత్వ ఆసుపత్రుల తనిఖీలు మొదలు పెట్టిన నూతన డీఎంహెచ్ఓ డాక్టర్ ఆనంద్
- జాతీయ ప్రోగ్రామ్స్ పక్కాగా అమలుకు చర్యలు
- టీ.బీ ముక్తి భారత్ పై ప్రత్యేక దృష్టి
- 24/7 గంటలు నడిచే హాస్పిటల్లో డెలివరీలు అమలు
- నవజాత శిశు మరణాలు 1 శాతానికి తగ్గింపు లక్ష్యంతో ముందుకు
- సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటికి సర్వే





**మేడ్చల్, నేడు బ్యూరో:** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ప్రజారోగ్య వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీ.ఎం అండ్ హెచ్.ఓ డాక్టర్: ఆనంద్ ఆ వైపు చర్యలు మొదలు పెట్టారు. ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టం చేయడంలో భాగంగా, డా: ఆనంద్ రెగ్యులర్ గా ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేస్తూ, ఆసుపత్రుల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తుండటమే కాకుండా, మెడికల్ ఆఫీసర్స్, సిబ్బంది పని తీరును మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోంది. జిల్లాలో వాటిని పక్కాగా అమలు చేసేందుకు, ప్రతి హాస్పటల్ ను సందర్శిస్తూ, గ్యాప్స్ ను గుర్తిస్తూ, పథకాలను స్టీమ్ లైన్ చేసేందుకు కృషి చేస్తున్నారు.

**టీ.బీ ముక్తి భారత్ పై ప్రత్యేక దృష్టి :**

మేడ్చల్ జిల్లాలో టి.బి బాధితులు దాదాపుగా 2100 మంది ఉన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం రూ.1000 లు చెల్లిస్తుంది. వీటిని నేరుగా టి.బి వ్యాధి గ్రస్తుల బ్యాంక్ ఖాతాలో వేసేందుకు చర్యలు చేపట్టారు. వీటి బాధ్యతను ఆశా వర్కర్లకు అప్పగించి, పక్కాగా అమలు జరిగేలా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా వారికి న్యూట్రిషన్ కిట్స్ అందించేందుకు కు చర్యలు ప్రారంభించారు. ఇందుకు గాను ప్రసాద్ హాస్పిటల్ సహకారం తీసుకోనున్నారు. అలాగే, లిప్రసీ పేషెంట్లకు కూడా ఆసరా పెన్షన్ ఇప్పించేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలో 24/7 గంటలు నడిచే హాస్పిటల్లో డెలివరీలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. బాలానగర్, అల్వాల్, కీసర, మల్లాపూర్ లాంటి హాస్పిటల్లో డెలివరీలు జరుగుతున్నాయి. అలాగే, ఈ హాస్పిటల్స్ లలో టాయిలెట్లు, బాత్రూమ్ లు సక్రమంగా పని చేస్తున్నవి లేనిది గమనించి, అవి పక్కాగా పనిచేసేవిధంగా చర్యలు చేపడుతున్నారు.

**సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు :**

వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, వాటి నివారణకు ఫీవర్ సర్వే నిర్వహించడమే కాకుండా, ఇంటింటికి సిబ్బందిని పంపించి దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టేందుకు చర్యలు మొదలు పెట్టారు. జిల్లాలో నవజాత శిశువుల మరణాలను తగ్గించేందుకు కూడా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా, జిల్లాలో నవజాత శిశువుల మరణాలను 1 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు గాను గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సహకారం తీసుకోనున్నారు. ఇలా, జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో బడుగు, బలహీన వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా కలెక్టర్ సహకారంతో, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్: ఆనంద్ చర్యలు చేపట్టారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో డిప్యూటీ డీ.ఎం అండ్ హెచ్.ఓ గా సుదీర్ఘ అనుభవం ఉన్న డాక్టర్: ఆనంద్ ప్రస్తుతం డీ.ఎం అండ్ హెచ్.ఓ గా మెడికల్ ఆఫీసర్స్, సిబ్బంది సహకారం తో సక్సెస్ అవుతామన్న ధీమాను సోమవారం ఆయన నేడు ప్రతినిధితో మాట్లాడుతూ, వ్యక్తం చేస్తున్నారు.

## లాల్‌బజార్ పాఠశాలలో "అరైవ్ అలైవ్" ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

**విద్యార్థులే ట్రాఫిక్ సేఫ్టీ అంబాసిడర్లుగా మారాలి: ఏసీపీ జి. శంకర్ రాజు**



**సికింద్రాబాద్,నేడు న్యూస్:** రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలను పాటించే అలవాటు పెంపొందించుకోవాలని తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. శంకర్ రాజు సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్, ట్రాఫిక్–1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం తిరుమలగిరి లోని లాల్‌బజార్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జి. శంకర్ రాజు విద్యార్థులకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్‌ను వినియోగించడం, ఫుట్‌పాత్‌లపై నడవడం, ట్రాఫిక్ సిగ్నళ్లను తప్పనిసరిగా పాటించడం వంటి అంశాలను వివరించారు. చట్టబద్ధమైన వయస్సు రాకముందు వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని వివరించారు. విద్యార్థులు "ట్రాఫిక్ సేఫ్టీ అంబాసిడర్లుగా" మారి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంత ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ. ఎల్. విజయలక్ష్మి, తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అదనపు ఇన్‌స్పెక్టర్ పి. రామనయ్య, ఉపాధ్యాయులు శ్రీనాథ్ శర్మ, భాగ్యవతి, విక్టోరియా, ఆర్. రామకృష్ణ, శ్రీనివాసరావు (పీ.ఈ.టీ.), ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసుల రోడ్డు భద్రతా కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## చినుకు పడితే చాలు.. బురదమయంగా మారుతున్న రోడ్డు

**అనుశక్తి నగర్, శ్రీహరి ఎన్‌క్లేవ్ వాసుల ఆవేదన.. వెంటనే రోడ్డు నిర్మించాలని డిమాండ్**



**బోడుప్పల్, నేడు న్యూస్:** చెంగిచెర్లలోని అనుశక్తి నగర్––శ్రీహరి ఎన్‌క్లేవ్‌కు వెళ్లే ప్రధాన రహదారి స్వల్ప వర్షానికే బురదమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్డు పూర్తిగా బురద నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో ప్రతి రోజూ పదుల సంఖ్యలో స్కూల్ బస్సులతో పాటు కాలనీవాసుల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో వాహనాలు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయని, రోజూ రెండు నుంచి మూడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల హౌస్ ట్యాక్స్‌లు వసూలు చేసినప్పటికీ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ సమస్యతో పాటు దెబ్బతిన్న రోడ్డు కారణంగా నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, బోడుప్పల్ మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టి ప్రజల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

**ప్రజావాణిలో కాప్రా డిప్యూటీ కమిషనర్‌కు సాయి లోక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి**



**ఉప్పల్/ కాప్రా, నేడు న్యూస్:** ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ, సాయి లోక్ కాలనీ ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సాయి లోక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కాప్రా డిప్యూటీ కమిషనర్‌కు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. కాలనీలో కొందరు వాహనదారులు అధిక వేగంతో నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతుండటంతో పాదచారులు, చిన్నారులు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి అవసరమైన ప్రాంతాల్లో తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన వారిలో సాయి లోక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. శంకర్, ప్రధాన కార్యదర్శి ఎన్. సురేష్, కెన్ ప్రకాష్, పి. బాలరాజ్, ఎన్. రాణి, పి. శ్రీనివాస్, జి. శ్రీనివాస్, పి. రాము తదితరులు పాల్గొన్నారు.

## డ్రాయింగ్‌లో సత్తా చాటుతున్న విశ్వాని



**భద్రాద్రి కొత్తగూడెం, ఇల్లందు,నేడు న్యూస్:** ప్రతి మనిషి తన అభిరుచులు, కోరికల కనుగుణంగా జీవితాన్ని మలుచుకోవడానికి కృషి,పట్టుదలతో సాధన చేస్తూ తన గమ్యాన్ని చేరుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తూ ఉంటారు. అదే కోవకు చెందిన కొత్తగూడెం పట్టణానికి చెందిన కంచర్ల మధు–సూదన్ రావు నర్మదా దంపతుల కూతురు విశ్వాని పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు తన చిన్నతనం నుండి డ్రాయింగ్ పట్ల ఆకర్షితురాలై స్వయంకృషితో చిత్రాలను చిత్రీకరిస్తూ తన నైపుణ్యాన్ని పెంచుకొని ఎలాంటి చిత్రాలనైనా అవలీలగా సృష్టికి ప్రతి సృష్టి అన్నట్లు అంత అద్భుతంగా డ్రాయింగ్ లో (ఆర్ట్) ప్రావీణ్యత సాధించింది. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అన్న చందంగా తన అభిరుచిని ఇష్టంగా మార్చుకొని తనకంటూ గురువు లేనప్పటికీ ఏకలవ్యుడి సాధనను స్ఫూర్తిగా తీసుకొని తన నైపుణ్యాన్ని పెంచుకోవడం ప్రారంభించింది. తన కంట పడిన ప్రతి చిత్రాన్ని డ్రాయింగ్ చేస్తూ తన ప్రతిభను స్నేహితులతో పంచుకొని ఆనందపడేది. తనలో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికి యువతీ,యువకుల జీవితాలకు,వారి ఆశయ సాధనకు, భవిష్యత్ జీవితానికి బాటలు వేసేది. కళాశాల విద్య ముఖ్య వేదిక కాగా తమలోని ప్రతిభను సమాజానికి పరిచయం చేయడానికి అవకాశం కోసం ఎదురు చూస్తారు. కళాశాల విద్య పూర్తి కాకుండానే పెద్దలు పెళ్లి సంబందాలు చూస్తూ ఖమ్మం పట్టణానికి చెందిన గేల్లా చలపతి లక్ష్మీ దంపతుల కుమారుడు శ్రీకాంత్ తో మూడుముళ్ల బంధంతో పెళ్ళి చేసారు. పెళ్లి అయినప్పటికీ తన ఇష్టాన్ని అభిప్రాయాన్ని, లక్ష్యాన్ని మరచిపోకుండా అంకుటిత దీక్షతో అపురూపమైనదమ్మ ఆడజన్మ ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మ అనే విధంగా తన భర్త కార్యకలాపాలు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఒక కుమారుడికి జన్మనిచ్చినప్పటికీ సంసారాన్ని చక్కదిద్దుకుంటూ అత్తమామల అభిమానాన్ని పొందుతూ తీరిక సమయాలలో చిత్రాలను చిత్రీకరిస్తూ స్వతహాగా తను నేర్చుకున్న చిత్రలేఖనాన్ని మరవకుండా నైపుణ్యాన్ని రంగరించి మరింత అపురూపమైన చిత్రాలను చిత్రీకరిస్తూ భద్రపరచు కుంటూ తను నేర్చుకున్న విజ్ఞానం,విద్యను పదిమందికి అందించాలనే తపనతో ఎదురుచూస్తోంది. అటు పుట్టినింటి నుండి గాని, అత్త ఇంటి నుండి గాని ఏ విధ మైన ప్రోత్సాహం లేనప్పటికీ స్వయంకృషితో తన లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ తనలోని ప్రతిభను ఎవరు గుర్తించకపోవడం, వెలుగులోకి రాకపోవడం కొంత నిరుత్సాహ పరుస్తుందన్నారు. ప్రోత్సాహం లభిస్తే స్వయంకృషితో ఎదిగిన విశ్వాని చిత్రలేకనం లో మరిన్ని అద్భుతాలు సృష్టించడానికి అవకాశముంటుంది. చిత్రలేఖనమే కాకుండా నటనలో అభినయంలో డ్యాన్స్‌లో కూడా ప్రావీణ్యం సాధించింది. విశ్వాని ఆశయం నెర వేరడానికి ప్రోత్సాహం లభించి సమయం సందర్భం వస్తుందా అనేది ఎదురు చూద్దాం.



## ఓటర్ల జాబితా సర్వే పై ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకస్మిక తనిఖీ

**ఇల్లందు:నేడు న్యూస్:** ఓటర్ల జాబితా నమోదు, సవరణల ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ఇల్లందు పట్టణంలోని 22,24వ వార్డుల్లో బిఎల్ఎ లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 22 వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వేలో ఎమ్మెల్యే పాల్గొని, బిఎల్ఎ లు నింపుతున్న ఎస్ఐఆర్ ఫార్మ్‌ను, ఓటర్ల వివరాల నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యమని, బిఎల్ఎ లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలనీ సూచించారు. ప్రతి ఇంటినీ సందర్శించి కొత్త ఓటర్ల నమోదు, పేర్లలో తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ మాట్లాడుతూ తమ వార్డులో ఓటర్ల నమోదు ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్,వైస్ చైర్మన్ పెండేల రాజు,పట్టణ అధ్యక్షుడు బోళ్ల సూర్యం,7వ వార్డు కౌన్సిలర్ రాజు గౌడ్, కో–ఆప్షన్ మడుగు సాంబమూర్తి,కాంగ్రెస్ నాయకులు దొడ్డ డానియల్,చెల్లా శ్రీనివాస్,ఆలేటి చిన్ని,పొట్ల శీను, సిహెచ్.రమేష్,బిఎల్ఎ లు కోలపురి ఝాన్సీ,సందీప్, బిఎల్ఓ లు అజ్మీర సక్కుబాయి, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

